క్రోక్విల్ హాస్యప్రియ - ఏప్రిల్, 1984

> "అప్పుడాయన తపోభంగం జరిగిన విశ్వామిత్రుడిలా ఉన్నాడు. తపోభంగం మేనకవల్ల అయినదేమో ముఖం ప్రసన్నంగానే ఉంది - "

# వామనరావు సాహిత్యం

మహాకవి వామనరావు తెలుగు సాహిత్యంలో చేపట్టని ప్రక్రియలేదు. గేయాలు, నాటికలు, కావ్యాలు, భావకవిత్వం, కథలు, కథానికలు, గల్పికలు, నవలలు, నవలికలు మాత్రమే కాక అటు బాలసాహిత్యంలోనూ ఇటు శవ సాహిత్యంలోనూ కూడా అన్నీ రాసేస్తున్నాడాయన. ఒక మనిషిలో ఇంతటి బహుముఖ ప్రజ్ఞ అసాధారణం అనిపించింది నాకు. ఆ మహానుభావుడిని కళ్ళారా చూసి ఆయన ప్రజ్ఞ రహస్యం గురించి ఆయనేం చెబుతాడో చెవులారా విని రావాలనిపించి ఒక రోజున ఆయనింటికి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి ఆయన బెడ్రూంలో కూర్చుని ఏదో రాసుకుంటున్నాడుట. ఆయన భార్య నాకీ విషయం చెప్పి నాలో రియాక్షన్ను చూసి..... అప్పుడు డ్రాయింగ్ రూంలోకి ఆహ్వానించింది. నేనక్కడ కూర్చున్న అయిదు నిముషాలకి కవిగారు వచ్చారు. అప్పుడాయన తపోభంగం జరిగిన విశ్వామిత్రుడిలా వున్నాడు. తపోభంగం మేనక వల్ల అయినదేమో ముఖం ప్రసన్నంగానే ఉంది.

"సాధారణంగా రాస్తున్నప్పుడు మధ్యలో లేవను. కానీ మీరు జర్నలిస్టు అని భయపడి లేచి వచ్చాను. ఈ రోజుల్లో కవులనూ రచయితలనూ నిలబెట్టాల్సిందీ నిలబెడుతున్నదీ జర్నలిస్టులే కదా!" అన్నాడు వామనరావు.

ఆయన మాటల్లో సూచన మాత్రంగా ప్రజ్ఞా రహస్యం దాగున్నదా అని నాకు అనిపించినా వెంటనే తేలిపోక "మీ వంటి ప్రజ్ఞాశాలి అలాగనడం నమ్రత అనిపించుకుంటుంది. నేను మిమ్మల్ని నిలబెట్టాలని రాలేదు. మీ బహుముఖ ప్రజ్ఞకు కారణాలన్వేషించాలని వచ్చాను" అన్నాను.

"కారణాలు కాదు. కారణం. కారణం పేరు. భారతి. భారతి నా భార్య" అన్నాడాయన.

గుడిసెలో అమ్మాయి కోటీశ్వరుడిని పెళ్ళాడితే తనూ భాగ్యవంతురాలవుతుంది.

తనకంటే చిన్నదైన అమ్మాయి తనకంటే పెద్దవాడిని పెళ్ళాడితే వదిన అనిపించుకుని పూజ్యనీయురాలవుతుంది. ప్రజ్ఞాశాలిని పెళ్ళాడిన ఆడవాళ్ళు అంతేనా?

"కారణమంటే ఏ విధంగా?" అన్నాను.

"నేను ఆంగ్లంలో ఒరిజినల్ ప్లస్ అనువాద సాహిత్యాన్నంతా అదే పనిగా చదివేవాడిని. తెలుగులో కావ్యాలన్నీ పఠించాను. బెంగాలీ నుంచి తెలుగులోనికి అనువదించబడిన మంచి రచనలన్నీ చదివేవాడిని. వేదాంతం నా అభిమాన వస్తువు. మానసికంగా బాగా ఎదిగానని నాకు నమ్మకంగా అనిపించింది. అయితే వివాహమైనాక నా భార్య కోసం నేను దిగిరాక తప్పలేదు. ఆమె అమాయకంగా పసిపాపలా నాకు అనిపించేది. ఆమెతో మామూలుగా సంసారం చేయాలంటే చదవడం తగ్గించాలని గ్రహించాను. చాలా తొందరగానే నాకు చదివే అలవాటు తగ్గిపోయింది. అలా కొన్నాళ్ళు గడిచేసరికి ఏ పుస్తకం తీసినా నేను ఒక్క వాక్యం కూడా చదవలేకపోయేవాడిని. నా తీరుబడినెలా ఉపయోగించుకోవాలో తెలియక నాలో దిగులు ప్రారంభమయింది.

"భార్య కోసం పుస్తకాలు మానేశానంటారు. అటువంటప్పుడు మీకు తీరుబడి ఎలా ఉంటుంది?"

వామనరావు నవ్వి - "నేను చదవడం మానేశాను కానీ నా భార్య మానలేదు కదా - ఆమెలోనూ సాహిత్యాభిలాష మెండు-" అన్నాడు.

నేను తెల్లమొహం వేశాను. నాకు విషయం అర్థం కాలేదని గ్రహించి వామనరావు - "నా భార్య చదివే సాహిత్యం వేరు ప్రస్తుతం నేను రాస్తున్నలాంటిదే" అన్నాడు.

"అంటే మీరు ప్రస్తుతం రాస్తున్నది మంచి సాహిత్యం కాదని మీ అనుమానమా?" అన్నాను ఆశ్చర్యంగా "అయితే మీ మీరెందుకు రాస్తున్నట్లు?"

"చెప్పానుగా, కారణం నా భార్య అని - అదెలాగో వివరిస్తాను. ఒకరోజు నా భార్య "మీకు చదువంటే విరక్తి కలిగిందని విచారించకండి. మీరు అన్ని రకాల సాహిత్యాన్నీ ఔపోసనపట్టి ఉన్నారు. మీ వంటి వారు స్వయంగా రంగంలోకి దిగి సాహిత్యసేవ చేయాలి. నా మాట విని రాయడం ప్రారంభించండి" అన్నది. ఆమె బలవంతం మీద రాయక తప్పలేదు. నాకు తెలిసిన వేదాంత సారాన్ని క్లుప్తంగా వివరించే ఓ కథ రాశాను. దానినేదైనా సాహిత్య మాసపత్రికకు పంపమని నా భార్యకు ఇచ్చాను. నా భార్య అది చదివి నాకు చెప్పకుండా ఒక పిల్లల మాసపత్రికకు పంపింది. వాళ్ళు వెంటనే దానిని వేసుకోవడమే కాక మంచి పారితోషికం కూడా ఇచ్చారు. నేను ఆశ్చర్యపడి అప్పట్నించీ పిల్లల పత్రికలకు రాయాలనుకున్నాను.

అప్పుడు నా భార్య నాతో కథకంటే నవలకు మంచి పారితోషికం ఉంటుంది కాబట్టి ఈసారి నవలే రాయండి అన్నది. నేను ప్రత్యేకంగా పిల్లల కోసం నూటయాభై పేజీల నవల రాశాను. నా భార్య అది చదివి బాగుందని మెచ్చుకుని ఓ సాంఘిక మాసపత్రికకు పంపింది. అప్పట్నించీ నేను నవలా రచయితనయ్యాను.

అటుపైన ఒక పర్యాయం నా భార్య నాపై అలిగి పుట్టింటికి వెళ్ళింది.

ప్రతిమాలుతూ ఓ ఉత్తరం రాశాను. నా భార్య కా ఉత్తరమెంతో నచ్చి వెంటనే ఒక పత్రికకు వచన కవితగా పంపింది. ఆనాటి నుండీ నాకు విప్లవ కవినని పేరు వచ్చింది.

అది చూసి విప్లవ భావాలతో కథ రాశాను. అది డిటెక్టివ్ కథగా ప్రచురించబడింది. ఆ తర్వాత నుంచి ఎన్నో రచనలు చేస్తున్నాను. ఏ పత్రికకు రాస్తున్నానో నాకు తెలియదు. ఆధునిక సాహిత్యం గురించి సమగ్రమైన అవగాహన ఉన్న నా భార్య ఆ విషయం చూసుకుంటుంది" అని ఆగాడు వామనరావు.

"మీరు చెప్పేది అసాధ్యమని నాకు తోస్తున్నది" అన్నాను.

"అటు రచనలను ఎన్నిక చేసేవారూ, ఇటు వాటిని చదివేవారూ అందరూ నా భార్య వంటి వారేననుకోండి - అప్పుడిది సాధ్యపడుతుందంటారా?" అంటూ వామనరావు ఎదురు ప్రశ్న వేశాడు నన్ను.

"మీకు సమకాలీన సాహిత్యంపై సదభిప్రాయమున్నట్లు లేదు. అటువంటప్పుడు మీరే ఎందుకు అటువంటి సాహిత్యాన్ని తయారుచేస్తున్నారు?" అని సూటిగా అడిగాను.

అప్పుడు వామనరావు గంభీరంగా ముఖం పెట్టి "పుస్తకాన్ని చదవడమన్న దొక మధురానుభవం. ఆ అనుభవానికీ, అనుభూతులకూ దూరమైనాక నాలో కసి, ద్వేషం, అసూయ నానాటికీ పెరిగిపోతున్నాయి. పుస్తకం తెరిచాక ఒక్క వ్యాసం కూడా చదవకూడదనిపించే దౌర్భాగ్యం నాకేకాదు ప్రతి పాఠకునికీ కలగాలి. అందుకే నేను రచనలు చేస్తున్నాను" అన్నాడు.

నేనేదో అనబోయేలోగా వామనరావు శ్రీమతి అక్కడకు వచ్చి - "మీ సంభాషణను నేను టేపు చేశాను. ఈ రోజుల్లో ఏ జర్నలిస్టు రచయితను ఇంటర్వ్యూ చేసినా ఆ వివరాలు హాస్య పత్రికకు బాగుంటాయి" అన్నది.

ఆమె డ్రాయింగ్ రూంలోని టేపు రికార్డరు ఆఫ్ చేసింది. లేచి అక్కణ్ణించి బయటపడుతున్న నా చెవుల్లో ఆమె చివరి మాటలే గింగురుమంటున్నాయి.

✦ ✦ ✦